# గీటురాయి

ఇచ్ఛాపురపు జగన్నాథరావు




గార్డెన్‌లో కూర్చుని ఆలోచించుకుంటూన్న నాకు అనిపించింది, చాలా కాలంనించి సుజాతతో నా జీవితం మరీ సాఫీగా సాగిపోతోంది అని.

ఆ ఆలోచనరాగానే దానివెంట సంతోషంకన్నా ఆశ్చర్యం ఎక్కువగా వొచ్చింది. సుజాత మరీ ఆదర్శగృహిణిగా అయిపోయిందే అనిమాత్రమేకాదు- ఆ విషయం గ్రహించడానికి నా కింత కాలం పట్టిందనికూడా.

క్రిందటిసారి సుజాత నాతో పోట్లాట వేసుకున్నది ఎప్పుడు?

అదీ కొంచెం ఆలోచించాల్సి వొచ్చింది.

అవును...అప్పుడు నా సిగరెట్లమీద ఆమె దాడిచేసినప్పుడు...అమిత నాకు దగ్గరగా వొచ్చే ప్రయత్నం చేసినప్పుడు.

ఆ సాయంత్రం బాగా జ్ఞాపకం వొస్తుంది. ఈ ప్రశాంత వాతావరణంలో సిగరెట్ కాలుస్తూ చుట్టూ ఈ పచ్చటి చెట్లవైపూ, రంగు రంగుల పూలవై చూస్తుంటే ఆ కథ అంతా జ్ఞాపకం వొచ్చింది. ఆ సాయంత్రం సుజాత తిరిగి వొచ్చి, అమిత కోరికమీద సిగరెట్ మానేసిన నాకు ఆమె సిగరెట్ అందించిన నిమిషమూ, తననిండా ఉన్న అభిమానం, నా మీది మమతా ఆ ఉదంతంతో పరిపూర్ణత పొందాయేగాని తరగలేదని ఒక్కమాటైనా అవసరం లేకుండా సుజాత నిరూపించిన ఆ రాత్రీ...క్షణక్షణం జ్ఞాపకం రాకపోయినా, మరువెలాగ వొస్తుంది ?

జీవితంలో మధురక్షణాలని ఆ క్షణంలోనే గుర్తించే నేర్పు నాకు కలుగజేసింది సుజాత.

ఆ తరవాత...

అంతా మరీ ప్రశాంతంగా జరిగిపోతోంది.

మాటి మాటికి తుఫానులు వొస్తేగాని జీవితం భరించలేని రకం మనిషినికాదు నేను కాని, సుజాతతో ఉండీ ఉండీ వొచ్చే తుఫానుల సంగతి వేరు. వాటి తరవాత ఇంద్రధనస్సు ఎప్పుడూ ఉంటుంది.

ఆకాశంలో నల్లటి మబ్బులు క్రిందటి అరగంటనించీ అలుముకుంటున్నాయి. వర్షం వొస్తే బాగుండును అనిపించింది- ఈ మధ్య మరీ వేడిగాఉంది.

రోడ్డుమీద కారు ఏదో ఆగింది. రెండుసార్లు హారన్.

సర్వెంట్ వెళ్ళి తలుపుతీశాడు. ఓంప్రకాష్ లోపలికి వొచ్చాడు.

నేనూ లేచి లోపలికి వెళ్ళేను, కుర్చీ టేబిలూ గార్డెన్‌లోనించి తీసి పడేయమని చెప్పి.

నన్ను చూస్తూనే లేచి అభివందనం చేసి, "ఏమిటి? ఈ మధ్య మరీ దర్శనం అవడంలేదు?" అన్నాడు ఓంప్రకాష్.

ప్రత్యభినందనంచేసి, "మీరూ ఇతర వ్యవహారాలలో నిమగ్నమైపోయారులా ఉంది...కనిపించనేలేదు" అన్నాను.

ఓంప్రకాష్ చాలా విచిత్రమైనమనిషి. సుజాతకి అడ్మైరర్. వాళ్ళిద్దరికీ స్నేహం ఎలాగ అయిందో నాకు తెలీదు కాని అతనికి ఆమె అంటే ఎంత అభిమానం, గౌరవం ఉన్నాయో అంత భయం కూడా ఉందని నాకు తెలుసును.

"ఈ రోజు డ్రామా ఉంది...సుజాత వొస్తానన్నారు" అన్నాడు ఓంప్రకాష్.

"అలాగా!" అన్నాను అప్రయత్నంగా.

సుజాత నాతో ఏమీ చెప్పనేలేదు.

అతను వాచీ చూసుకున్నాడు.

నేను అతనికి టీ ఇచ్చే ఏర్పాటుచేసి మీదికి వెళ్లేను. సుజాత అప్పుడే టాయిలెట్ ముగించినట్టు ఉంది. అద్దం ముందర నిలబడి చివరి 'టచెస్'ఇస్తోంది.

ఆమె చూడ్డానికి బాగుంది.

నా కెప్పుడూ బాగుంటుంది సుజాత. కాని, ఆ రోజు ప్రత్యేకంగా, ఇంకా బాగుంది. కళ్ళలో కొత్త మెరుపు.

నన్ను చూసి, చిరునవ్వుతో, "ఏం? చూడాలనిపించిందా?" అంది సుజాత.

"అవును" అన్నాను.

"అబద్ధాలు!" అంది సుజాత.

"కాదు!" అన్నాను.

"ఓంప్రకాష్ వొచ్చాడని చెప్పటాని కేనా వొచ్చారు?" అంది సుజాత నవ్వు తోనే.

"అవును...కాని..."

ఒక్కసారి గంభీరంగా అయి, "చిన్న చిన్న అబద్ధాలు...జీవితానికి పూసే రంగులు...కాని, అవి తెలిసేలాగ ఉండకూడదు" అంది సుజాత.

నేనేమీ అనలేదు.

ఏమనేదీ?

"ఇవేళ అనార్కలీ నాటకం ఉందట..." అంది చెరగనితల మరొక సారి దువ్వుకుంటూ సుజాత.

"అలాగా?" అన్నాను పొడిగా. సుజాత రోజంతా నాతో చెప్పకుండా ఇలాగ హటాత్తుగా, అదీ నాకు తెలిశాక ఈ సంగతి నాకు చెప్పడం నాకంత బాగులేదు.

నవ్వి, "ఏం? ముందుగా పెర్మిషన్ తీసుకోలేదని కోపం వొచ్చిందా?" అంది నా కళ్ళలోకి చూస్తూ.

"అవును...కొంచెం" అన్నాను.

"మీరు కాదంటే వెళ్ళను" అంది సుజాత మంచంమీద కూర్చుంటూ.

విచిత్రమైన పరిస్థితి అది. అవునన్నా కాదన్నా నా నెత్తిమీదికే వొస్తుంది... రెండు మార్గాలూ ఓటమిలో రెండు రకాలే! తరుచూ నే నిలాటి అవస్థలో పడుతూ ఉంటాను.

ప్రయత్నించి నవ్వి, "వెళ్ళిరా!" అన్నాను... ఏమీలేనిదానిలో దుమారం లేవడం ఇష్టంలేక.

"మీరు..."

"ఇక్కడే ఉంటాను..."

స్పృశించబోయిన నా చేతిని సున్నితంగా తప్పించుకుని నవ్వుతూ, "గంట సేపు తయారయాను... నిమిషంలో మీరు చిందరవందరచేస్తే ఎలా!"అంటూ సుజాత క్రిందకి నడిచింది. ఆమె వెనుకనే నేనూ నడిచాను.

సగం తాగిన టీ వొదిలేసి, ఓంప్రకాష్ నిలబడి, "పదండి ... టైం అయిపోయింది!" అన్నాడు.

"మీరు వీల్ దగ్గరఉంటే గడియారాలు వెనక్కి నడుస్తాయి..." అంటూ సుజాత దారితీసింది. నేనూ గేటుదాకా వెళ్లేను. చిన్న చినుకులు కొంచెం పడుతున్నాయి.

సుజాత కూర్చుని నాతో "బుద్ధిగా ఉండడేం!" అని అటుచూసి హటాత్తుగా ఆగిపోయింది. ఎదురుగా ఒక్కసారి నా కళ్లని తిప్పుకుని మళ్ళీ తిరగనియ్యని సౌందర్యంఉన్న ఎవరో వొస్తున్నారు.

సుజాత, ఆమె పది అడుగులువేసి మా గేటులోకి తిరిగేదాకా ఆమెవంక చూసి, ఓంప్రకాష్‌తో ఏదో అంది... కారు ఒక్కసారిగా వెళ్ళిపోయింది.

నేను కళ్ళు తిప్పుకుని కారువైపు చూసేసరికి కారు మా వీధిమలుపు తిరిగి పోయింది.

"నమస్తే..."

ఎంతో తియ్యటి గొంతుక.

అటు మళ్ళీ తిరిగి "నమస్తే ... మీరు..." అన్నాను.

"నేను రేఖని..."

"ఓ!" అన్నాను. ఆమె పేరుకూడా చాలా అందంగా ఉంది, ఆమెలాగే. కాని, అదంతా అమె కెలాగ చెప్పేది?

చినుకులు ఒక్కసారి ఎక్కువయాయి.

"లోపలికి రండి" అన్నాను తోవ చూపెడుతూ. రేఖ తొందరగా నడవ లేదు. నేనూ వేగంతగ్గించి ఆమె వెనకాల నడిచాను.

డ్రాయింగ్‌రూమ్‌లో ఆమెని కూర్చోమన్నా ఆమె కూర్చోకుండా, "మిమ్మల్ని డిస్టర్బ్‌చేస్తూన్నందుకు విచారిస్తున్నాను" అంది.

క్షణికంగా, ఆమె అంటోన్నట్టు కాక పోయినా, ఆమె నన్ను డిస్టర్బ్ చేసిన మాట నిజమే...కాని...

"అలాగ మీరేం చెయ్యలేదు..."

నవ్వుతూ "నాకు కళ్లున్నాయి" అంది రేఖ...ఒక్క క్షణం అందమైన తన కళ్లని మరింత పెద్దవిచేస్తూ.

"దయచేసి కూర్చోండి" అన్నాను. నన్ను నేను స్థిరంగా చేసుకోవాలి అని నాకు నేను చెప్పుకుంటూ.

"వొద్దు ... మా టెలిఫోన్ పాడయింది...మీ ఫోన్ ఒక్కసారి..."

"తప్పకుండా..."అని ఆమెకి ఫోన్ చూపాను. ఆమె నా వైపుచూసి "కంప్లయింట్ నంబరెంత?" అంది.

"198—" అని చెప్పి, నా ఆశ్చర్యం దాచుకోలేక, "మీరు...మీకు కొత్తలాగ ఉంది! ఇంతకు ముందు ఫోన్ ఎప్పుడూ చెడలేదా?" అన్నాను, ముందరి సగంలో చేసిన పొరపాటుని సరిదిద్దుకుంటూ.

"నాకు తెలీదండీ! ... పదేళ్లయిపోయింది—ఇండియాలో లేను..."అంది రేఖ.

ఆమె చేతిలోనించి రిసీవర్ తీసుకుని "మీ నంబరు చెప్పండి—నేను రిపోర్ట్ చేస్తాను" అన్నాను.

రేఖ నవ్వి, తన నంబరు చెప్పింది. నేను కంప్లైయింట్ ఇచ్చి, "మళ్ళీ నాకు

రింగ్‌చేసి చెప్పండి" అన్నాను రేఖకి సహాయం అవుతుందని.

"థాంక్స్...కాని మీకు డిస్టర్బెన్స్" అంది రేఖ, కళ్ళతో కృతజ్ఞత చెప్తూ.

"ఏమీలేదు...కూర్చోండి."

"పది నిమిషాలు—ఆ తరవాత వెళ్ళిపోవాలి," అంది రేఖ వాచీ చూసుకుని.

తరువాతి రెండు గంటలూ టీ తాగుతూ, బయట గట్టిగా పడుతూన్న వర్షాన్ని గమనిస్తూ సంభాషణలో గడిపాము. ఆమెకి ఇండియా కొత్త...ఇక్కడ సెటిల్ అవుతుందిట. మా వీధిలో ఆ వైపునఉన్న చక్రవర్తి తమ్ముడిగారి అమ్మాయి రేఖ. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో కొంతకాలం చదివింది. ఇక్కడ ఏంచెయ్యాలో నిర్ధరించుకోలేదు. మాట్లాడ్డానికి మరీ ఎవ్వరూ లేరు. చక్రవర్తిగారు మరీ 'ఓల్డ్‌మాన్...'

ఆమెకి సంభాషణలో చతురత ఉంది. నా నించి నా విషయాలు చాలా రాబట్టింది. ఇప్పుడు తలుచుకుంటే, సామాన్యంగా ఎవ్వరికీ చెప్పని అన్ని విషయాలు ఆమెఅంత సుళువుగా, సంతోషంగా ఎలాగ చెప్పేననే ఆశ్చర్యం కలిగినా ఆ సాయంత్రం, ఆ రాత్రి, ఆమె సాహచర్యంలో అన్నీ మరిచిపోయాను.

తొమ్మిదవుతూంటే నా ఫోన్ మోగింది.

టెలిఫోన్ వాళ్లనుకున్నాను.

కాని, అటు మాట్లాడుతోన్నది సుజాత.

ఆశ్చర్యంతో "ఎక్కడినించి?" అన్నాను, ఆలోచనలని కూడదీసుకుంటూ.

"క్వాలిటీనించి..."

"ఎందుకని? కారు తెచ్చేదా?"

సుజాత నవ్వి, "అక్కర్లేదు" అంది.

"మరి?"

"మీ మాట జ్ఞాపకంవొచ్చి, గిల్టీగా ఫీలయ్యాను...ఏం చేస్తున్నారో చూద్దామని..."



"థాంక్స్...నాటకంఅయిపోయిందా?"

"ఒకటి అయిపోయింది..."

"ఎలాగ ఉంది?"

"చెత్తగా"

"రెండోది?"

"నేను చూస్తేగా?"

"ఏం?"

"అది ఇప్పుడే ప్రారంభం అవుతోంది..."

"చూస్తావా?"

"చూడక తప్పదు..."

"మరి?"

"పది నిమిషాల్లో ఇంటికి వొస్తున్నాను."

నే నేమీ అనేలోపున సుజాత ఫోన్ పెట్టేసింది. రేఖ నా సంభాషణ వినినా, విననట్టే లేచి నిలబడి, "మరి నాకు సెలవియ్యండి...మీ సాయంత్రం అంతా పాడుచేశాను" అంటూ నిలబడింది.

బయట వర్షం ఇంకా పడుతూనే ఉంది.

"పదండి..కారులో వొదిలి వొస్తాను" అన్నాను.

కాని, రేఖ వినలేదు. నన్ను మాటలతోనూ,చేతులతోనూ వారిస్తూ, "వర్షంలో తడవడం ఎంతోసరదా నాకు...అయినా, నాలుగు నిమిషాల నడకకి భయం ఎందుకు?" అంటూ బయలుదేరింది.

తొందరగా గొడుగుతీసుకుని రేఖని ఇంటిదగ్గర వొదిలాను. సెలవు తీసుకోబోయినా కుదరలేదు. అక్కడ మరో అరగంట గడిచిపోయింది.

వొచ్చేటప్పుడు గొడుగు మరిచిపోయాను—అప్పటికి వర్షం బాగా తగ్గిపోయింది. సగందూరం వొచ్చాక

గొడుగుమాట జ్ఞాపకం వొచ్చినా మళ్ళీ వెళ్ళాలనిపించలేదు.

ఇంటికి దగ్గరగా వొస్తూన్నకొద్దీ నాకు ఏదో నేరంచేసిన బాధ ఎక్కువైంది. రేఖలో ఏదో భయంకరమైన ఆకర్షణఉంది. ఆమెతో ఉన్నంతసేపూ నాకు సుజాత జ్ఞాపకమే రాలేదు!

అంతకన్నా ముఖ్యమైంది...సుజాత ఏమంటుందనే ప్రశ్న.

లోపలికి వెళ్లేసరికి సుజాతడ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని టీ తాగుతోంది. నన్నుచూసి చిరునవ్వు నవ్వి, తరవాత నే నక్కడ లేనట్టే ప్రవర్తించింది.

నేను ఆమెకి ఎదురుగా కూర్చున్నాను.

గడియారంలో నాలుగు నిమిషాలే నిశ్శబ్దంగా గడిచిపోయినా, నాకు అవి నాలుగ్గంటల్లా ఉన్నాయి...మామూలుగా సుజాతకి ఇలాటి నిశ్శబ్దం అలవాటులేదు. ఆమె టీ తాగడం ముగించి, కప్ కిందని పెట్టి చదివేందుకు వో పుస్తకం తీసుకుని దానిలోకి చూస్తూ కూర్చుంది.

నా బట్టలు తడిసిఉన్నాయి. చలి చలిగాఉంది. వొస్తూనే బట్టలు మార్చు కునిఉంటే బాగుండును. ఈ సమయంలో వెళ్లడం అనేక కారణాలవల్ల మంచిదికాదని నాకు తెలును.

సుజాత నిశ్చలంగా చదువుకుంటోంది. తుఫాను పెద్దదైనకొద్దీ ఆమెకి స్థైర్యం ఎక్కువ అని నాకు తెలుసును. ఈ వ్యవహారంలో గెలుపే ఓటమి అనీ ఓడడం గెలవడమేననీ నాకు తెలుసును.

అందుకే భరించలేని ఆ నిశ్శబ్దాన్ని భంగంచేస్తూ, ''నాటకం ఎలాగ ఉంది?'' అన్నాను.

"ఏ నాటకం ?'' అంది సుజాత.

ఆమె మాట్లాడినందుకు సంతోషించాలో లేక నా ప్రశ్నలోని మూర్ఖత్వానికి నేను విచారించాలో నాకు తెలియ లేదు.

"నువ్వు వెళ్లినది...అనార్కలీ."

"అది చెత్తగాఉంది... చివరివరకూ చూడలేదు."

"సారీ !" అన్నాను.

"దేనికి ?"

"నువ్వు డిసపాయింట్ అయినందుకు."

"మరో నాటకం చూశాగా ?"

"అలాగా !" అన్నాను పొడిగా.

"అవును... మీరు వేసినది !"

"అదేమీలేదు."

"నిజంగా ?"

"నిజంగా."

"రేఖ—అదేనా ఆమె పేరు ?"

"నీకెలాగ తెలుసును ?"

సుజాత నవ్వి, "తెలుసును" అంది. ఆ చిరునవ్వు కారుమేఘాల్లో మెరుపు లాగఉంది-క్షణికంగా, చీకటిని ఎక్కువ చేస్తూ.

"రేఖ ... టెలిఫోన్‌కోసం ఎదురు చూస్తూ మాట్లాడింది-అంతే !"అన్నాను.

సుజాత చదువుతోన్న పుస్తకం మూసి, "నాన్నగారు టెలిఫోన్‌చేశారు" అంది.

ఆమె అంత హటాత్తుగా విషయం మార్చడం నన్ను ఆశ్చర్యపెట్టింది.

"ఏమంటారు ?" అన్నాను.

"ఆయన నన్ను రమ్మన్నారు."

అనేఉంటారు — సుజాత ప్రశ్నకి జవాబుగా.

నే నేమీ అనలేదు; ఏ ముందని ?

"వెళ్లేదా ?''

''అత్యవసరమైతే...''

''థాంక్స్...''

''కాని- మళ్ళీ ఎప్పుడు వొస్తావు ?"

"తీరుబడిగా..."

"తొరగా వొచ్చి..."

''ఎందుకని ?''

''నువ్వు లేందే తోచదు."

''సాయంత్రంలాగ !''

''అలాగ కాదని నీకు తెలుసు!''

"నాకు చాలా తెలుసు!" కాని, నాకు ఆకలిగాఉంది...పొద్దుటే పోవాలికూడా! ...పదండి-అంటే మీకింకా ఆకలిఉంటే" అంది సుజాత లేస్తూ.

''నేరం లేకుండా శిక్షవేస్తున్నావు!" అన్నాను డైనింగ్‌రూముకి దారితీస్తూ

నవ్వుతూ "శిక్ష ఏముంది ? రేఖ ఓదార్చుతూ ఉండకపోతుందా !'' అంది సుజాత.

బయట వర్షం మళ్ళీ ఎక్కువైంది. ఈసారి ఉరుములూ మెరుపులూను. సుజాతకి అవి అంటే భయం—అలాగ కాకపోతే ఆ రాత్రి ఆమె నాకు దూరంగా ఉండిపోయేది. ఆ సాన్నిహిత్యం ఆ రాత్రి మట్టుకే. ఉదయం నాకు తెలివివొచ్చే సరికి సుజాత ఢిల్లీ వెళ్ళిపోయింది.

నానేరం నాకు తెలుసును. రేఖకి ఎలాగైనా దూరంగా ఉండాలనీ, సుజాతని త్వరగా రప్పించుకోవాలనీ అనుకున్నాను. ఆమె లేనిదే, నిజంగానే నాకు తోచదు.

ఆ సాయంత్రం, ఆ మరునాడూ ఇంట్లో ఉండకుండా తిరిగాను. రేఖ రాలేదు. ఆమె టెలిఫోన్ కూడా చెయ్యలేదు.

ఈ విషయం ముందు కొంత రిలీఫ్ ఇచ్చినా, నా అంతరాంతరాలలో కొంత బాధనీ కలుగజేసింది. కాని, అదే మంచి దని అనుకుంటూ మూడోరోజు గార్డెన్‌లో కూర్చున్నాను, కళ్లుమూసుకుని. ఈరోజు సుజాతకి ఫోన్‌చేసి వొచ్చేలాగ నచ్చ చెప్పాలనీ, దానికెలాటి సంభాషణ కావాలోననీ ఆలోచిస్తూంటే, "జగన్!'' అని పిలుపువిని కళ్లుతెరిచేసరికి రేఖ ఎదురుగా నిలబడి, ''సారీ! మిమ్మల్ని మళ్ళీ డిస్టర్బ్‌చేశాను !'' అంటోంది.

ఆమెని కూర్చోబెట్టి టీ ఇచ్చి కుశల ప్రశ్నలువేశాను... చాలా అందమైన రేఖ అలాగరావడంతో నా ఇతర ఆలోచన లన్నీ పటాపంచలయాయి. ఆ రాత్రి

సినిమాచూసి వొచ్చేక సుజాతకి టెలిఫోన్ చెయ్యడంమాట జ్ఞాపకంవొచ్చింది, మరీ ఆలశ్యంగా.

తరువాత నాలుగురోజుల్లోనూ రెండు సెలవులువొచ్చాయి.'తాజ్' రేఖ నాతోనే మొట్టమొదట చూసిన విషయం చాలా సంతృప్తి ఇచ్చింది.

ఆగ్రాఫోర్ట్, ఇత్మదుదౌలా అన్నీ తిరిగాము...రేఖ ప్రతిరోజూ నాకు శ్రమఇస్తోన్నందుకు నొచ్చుకొంటూ, నన్ను చాలా వారిస్తూనేఉన్నా నేనామెకి భారతీయ చరిత్రనీ, మరపురాని మన కళాఖండాలనీ చూపే ఉత్సుకతలో ఆమెతో చాలా సమయం గడిపాను.

ఆ ఆదివారం రేఖని తీసుకుని ఫతేపూర్‌సిక్రీ వెళ్ళేను.

ఉదయం పదకొండుకి చేరి అక్కడి చారిత్రిక భవనాలన్నీచూసి, భోజనం చేసి విశ్రాంతి తీసుకున్నాము. బులంద్ దర్వాజా, ప్రాకారం మీదనించి నూతిలోకి ఉరికే సాహసులూ రేఖకి చాలా నచ్చారు. వాటికన్నిటినీ ఫొటోలు చాలా తీసింది.

సాయంత్రం ఇంటికి చేరేసరికి సూర్యాస్తమయం అవుతోంది-చాలా అలిసిపోయాను. రేఖ ఆ రాత్రి డిన్నర్‌కి పిలిచింది. ఎందుకనో, వెళ్ళాలన్న ఉత్సాహంలేదు.

స్నానంచేసి, చెట్లమధ్యన కూర్చున్నాను.

సుజాత వెళ్ళిన తరవాత ఆమె టెలిఫోన్ కూడా చెయ్యలేదు....ఇది ఆమె పద్ధతికాదు. వెళ్ళిన మరునాడే టెలిఫోన్ చేసి "ఏమండీ? భోజనం ఎలాఉంది?" అని అడుగుతుంది.

''బాగానే ఉంది'' అంటాను పొడిగా.

''వంటమనిషి బాగాచేస్తుందికాదూ?"

"అవును'' అంటే, దానిమీద తన వంటని బాగాలేదన్న అర్థంతీసి, "కాదు" అంటే దానికి ఓటమిగా నేను నటించే అర్థంతీస్తుంది. ఆ సంభాషణలో తాను తిరిగివొచ్చేందుకు షరతుల విత్తనాలు నాటి. వారం తిరగక్కుండా....

కాని ఈసారి ఆమె నన్ను మరిచేపోయింది.

రేఖ...

ఆమెమీద విపరీతమైన వ్యామోహం నాకు ముందరఉన్న సంగతి నిజం... ఆమె ఒక్కసారి ఝంఝూమారుతంలాగ నాజీవితంలోకి వొచ్చి నన్ను ఉక్కిరిబిక్కిరిచేసింది. కాని అతిస్వల్పమైన చనువులు తప్ప ఆమె నాకివ్వగలిగిన వేవీలేవు... నే నామెకి ఇవ్వలేనట్టే.

దీనికంతా అర్థం ఏమిటి?

రేఖకి సుజాత పేరైనా తెలిసినట్టు సూచనలేదు. సుజాతకి ఆమె ఎలాగ తెలుసును?

అన్నీ ప్రశ్నలు-

హటాత్తుగా, బలంగా, అనిపించింది సుజాతవొస్తే బాగుండునని. దాని వెనకనే అనిపించింది, రేఖని కలిసిఉండకనేపోతే బాగుండునని. ఈ ఝంఝూమారుతం ఇంక నన్ను ఉక్కిరిబిక్కిరి చెయ్యకపోయినా, సుజాతఉండి వీచించే మలయమారుతం నాకూ నా అలవాట్లకీ, నా జీవితానికే సరిపోతాయనిపించింది.

కాని, రేఖ.

ఆమెని ఊహించుకునే ప్రయత్నం చేశానుగాని, విచిత్రంగా ఆ రూపంలోని వివరాలు కళ్ళముందుకి రాలేదు. ఆమెతో ఆ ఐదారు రోజులూ గాలిలాగ తిరిగిన చోట్లూ, తొందర్లో చెప్పుకున్న కబుర్లూ చూచాయగా జ్ఞాపకం.

తాజ్.

తాజ్‌కి నే నెన్నిసార్లు వెళ్లేనో! ఆ లాన్స్‌లో, పచ్చటిచెట్లవారగా నిశ్శబ్దంగా కూర్చుని నాలో నేను ఆలోచించుకోవడం అలవాటు నాకు. సుజాత నాతోఉన్నా నన్ను సామాన్యంగా డిస్టర్బ్ చెయ్యదు.

రేఖ అలాగకాదు.

అక్కడఉన్న రెండుగంటలూ ఆమె ఏదో మాట్లాడుతూనేఉంది. నా ప్రశాంతతని భగ్నంచేసి, ఆక్షణాల్లో నాకది అంత వెగటుగా కనిపించకపోయినా ఇప్పుడు ఆలోచిస్తే చిరాగ్గాఉంది.

రోజంతా తిరిగి తిరిగి ఉన్నానేమో, అలిసిపోయాను. ఒక్కసారిగా ఒక నిర్ణయానికివొచ్చి రేఖకోసం టెలిఫోన్ చేశాను. ఆమె టెలిఫోన్ దగ్గరికి రాలేకపోవడం నాకు ఆశాభంగం కలిగించలేదు. నా పని సుళువైందనిపించింది. రాత్రి రాలేనని మెసేజ్‌ఇచ్చి వెళ్లి కొంచెంసేపు నిద్రపోదామని పడుకున్నాను.

రాత్రి తొమ్మిది దాటాక తెలివివొచ్చింది.

టెలిఫోన్ మోగుతోంది.

నిద్రమత్తులో ఎత్తబోయి, తెలివొచ్చి మానేశాను.

నిద్రవొదిలేలాగ ముఖం కడుక్కుని కారు తీసుకుని బయలుదేరాను- ఈసారి సుజాత నా కారు వొదిలెయ్యడం ఇప్పటికి మంచిదయిందనిపించింది.

సదర్ బజార్‌కి వెళ్లి, క్వాలిటీలోతిని, పానగల్ పార్కుకి వెళ్లి, వెన్నెలలో కొంతసేపుకూర్చుని బాగా ఆలశ్యంగా ఇంటికిచేరేను. నిద్దరరావడంలేదు, చాలా కారాణాలవల్ల.

చదివి చదివి ఏప్పుడోనిద్రపోయాను.

ఉదయంలేచి టీ తాగుతూంటే సుజాత వొచ్చింది- వాళ్ల నాన్నగారి కారులో.

వొస్తూనే నా ఎదురుగా కూర్చుని, తానూ ఒక కప్ టీ తాగి, లోపలికి వెళ్లిపోయింది.

ఆవిడకి ఉదయానే నన్నుచూసే అలవాటులేదు- గడ్డం చేసుకుని స్నానం చేసేదాకా. నాతో టీ తాగడం ఒక కన్సెషన్ అయిఉండవొచ్చు.

కాదని, సాయంత్రం తెలిసింది.

నాకేదో పని ఉండి ఫిరోజాబాద్ వెళ్లాను-తిరిగి వొచ్చేసరికి చీకటి పడింది. ఇంటికిచేరేసరికి సుజాత లేదు!

"ఎక్కడికి వెళ్లింది?" అని అడిగాను సర్వెంటుని. వాడికీ తెలీదు. కాని, నన్ను డిన్నర్‌కి వెయిట్ చెయ్యొద్దని చెప్పి మరీ వెళ్లింది.




అలాగే చేశాను-ఆకలిగా ఉండి.

పడుకుని, పుస్తకంచదువుకుంటూంటే సుజాత వొచ్చింది.

"ఎక్కడికి వెళ్ళావు?" అన్నాను.

"డిన్నర్‌కి"

"ఎక్కడ?"

"చక్రవర్తిగారింట్లో"

ఆమె నవ్వుతోంది. వాళ్ల నాన్నగారి కారు మధ్యాహ్నం ఢిల్లీ వెళ్లిపోయింది. ఈమె ఇలాగ.

"అలాగా!" అన్నాను.

"అవును... రేఖ బర్త్‌డే ఇవాళ."

నే నేమీ అనలేదు-అవసరంలేక.

నా పక్కకి వొచ్చికూర్చుని, నా చేతిలోని పుస్తకాన్ని తీసి అవతల పెట్టి, "గీత చాలా చక్కని అమ్మాయి కాదూ?" అంది సుజాత.

"అవును. కాని—"

సుజాత చిరునవ్వుతో నా మీదికి వొంగి, "'కాని' ఏమిటి?" అంది, జవాబుకోసం నాకళ్లలోకి చూస్తూ.

ఆమెని దగ్గరగా తీసుకున్నాను, జవాబుగా.

"అవును కాని, ఏ నిజమైనా తెలియాలిగా?...ఒకసారి చాలదు-మళ్ళీ, మళ్ళీ" చిరునవ్వు రాలేదు నాకు.

"అలాగే మీగురించిన నిజం...నిన్నటితో, మీరు రాత్రి వెళ్లకపోవడంతో, నాకు మరోసారి తెలిసింది"

వింటున్నాను.

"శుభ్రంచెయ్యకపోతే బంగారమైనా మురికిగా ఉంటుంది...ఇలాటి అనుభవాలు లేకపోతే మీరు కూడా అంతే!"

లాలనగా, అనురాగంతో నాకు దగ్గరగా, చాలా దగ్గరగావొచ్చి, గంభీరంగా చెప్తోంది సుజాత.

"కాని, సుజాతా..." అన్నాను, ఒకటి అడగబోయి. నవ్వుతూ, "రేఖని మీ కన్నాముందు తెలుసు నాకు. ఆమెకీ మీ ఆరాధన చాలా ఉత్సాహంకలుగజేసింది పాపం! ఆమె నిజంగా అమాయకురాలు."

నేను గాఢమైన ఆలోచనలో పడ్డాను. అనేక విషయాలని గురించి.

కాని, సుజాత మలయమారుతమే అయినా, నా ఆలోచనల్ని సాగనియ్యకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తోంది నన్ను. మళ్ళీ ఆమె నన్నిలాటి పరీక్షకి గురి చేస్తుందా అని నేనడగలేదు.

అలాగ అడిగే అవసరం లేకపోయింది.

అవకాశమూ లేకపోయింది. ఎందుకంటే బయట హటాత్తుగా వరం ప్రారంభించింది. ఉరుములూ, మెరుపులూతో.